W W W.EPAPER.MAHADAILY.COM

# మహా పత్రిక

24-3-2026

వరంగల్





## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో బాల్య వివాహాల నిరోధక చట్టం-2006కు సంబంధించిన గోడపత్రికలను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సోమవారం ఆవిష్కరించారు. మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, హనుమ కొండ జిల్లా ఆధ్వర్యంలో, మిషన్ శక్తి జిల్లా మహిళా సాధికారత కేంద్రం ద్వారా బేటీ బచావో -బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

02



05

## గుడుంబా స్థావరంపై పోలీసుల దాడి

గొర్రె కుంట గ్రామ శివారులో నందనాయక్ తండకి చెందిన భూక్యా శంకర్, తండ్రి పేరు సేవ అనే వ్యక్తి ప్రభుత్వ నిషేధిత గూడంబ ను తయారు చేస్తున్నాడనే పక్కా సమాచారం తో గూడంబా స్థావరం పై దాడి చేసి సుమారు 600 లీటర్ల గూడంబా పానకాన్ని ధ్వంసం చేయడంతో పాటు 5 లీటర్ల గూడంబాను స్వాదీనం చేసుకొని కేసు నమోదు చేశారు.



# బల్దియాలో దోమల దండయాత్ర


## జీతాలు ఫుల్.. విధులు నిల్

- విషజ్వరాల పాలవుతున్న వరంగల్ నగర ప్రజలు
- నిర్లక్ష్యం లో మునిసిపల్ మలేరియా విభాగం
- నామమాత్రంగా నాసిరకం దోమల మందు ఫాగింగ్
- నివారణకు కోట్ల బడ్జెట్ .. లాభం ఎవరికి
- సంచలనంగా మారిన మహా కథనం.. వాట్సాప్‌లో వేలాది షేర్లు

రాజధాని హైదరాబాద్ సిటీ తర్వాత అతిపెద్ద నగరంగా చెప్పుకుంటున్న వరంగల్ నగరం పేరుకే స్మార్ట్ సిటీ.. గ్రేటర్ వరంగల్ నగరం ఇప్పుడు దోమల సిటీగా మారింది. నగరమంతా దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. నగర ప్రజలు విష జ్వరాల పాలవుతూ ప్రాణాలు కూడా పోగొట్టు కుంటున్నారు. నగరంలో కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీలు, ఖాళీ ప్లాట్లు, చెరువులు, కుంటల లో నీరు నిలిచి ఉండడం వల్ల దోమల లార్వా వృద్ధి చెంది ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇండ్లలో దోమల నివారణకు వినియోగించే ఎలక్ట్రికల్ పరికరాలు కూడా దోమల దాడికి అవి కూడా పనిచేయడం లేదని ప్రజలు చెబుతున్నారు. సోమవారం దోమల సమస్య తీవ్రతపై మహా పత్రికలో వచ్చిన కథనం సంచలనమైంది. వేలల్లో కథనాన్ని షేర్లు చేయడంతో పాటు పలువురు ఫోన్ చేసి అభినందించారు. సమస్య తీవ్రతకు ఇది అద్దం పడుతోంది.

మహా, వరంగల్ బ్యూరో

03



### కొన్ని ప్రాంతాల్లో ప్రజలు జాగారం

వరంగల్ నగరంలో దోమలు రోజు రోజుకు పెరిగి ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కొన్ని కాలనీల తో పాటు లోతట్టు ప్రాంతాల ప్రజలు రాత్రి సమయంలో జాగారం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యంగా ఎండాకాలం వానాకాలం డెంగీ, మలేరి యా, విషజ్వరాలు పెరుగుతాయని రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగానే హెచ్చరించినా బల్దియా అధికారులు, సిబ్బంది పట్టించు కోకపోవడంతో దోమల బెడద అధికమవుతున్నటు తెలుస్తోంది.

## పర్యావరణ సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో ప్రపంచ అరణ్య దినోత్సవం సందర్భంగా సోమవారం వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సామాజిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలు, ఎమ్‌జేపీటీ పాఠశాలలు, గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలలో "పర్యావరణ పరిరక్షణ" అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.

04



# ప్రశ్నిస్తే అరెస్టు లేనా.?

## పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎర్రబెల్లి

**మహా వరంగల్ బ్యూరో:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, అరాచక పాలనను కొనసాగిస్తున్న నేపథ్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు తో కలిసి వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీ యడానికి శాంతియుతంగా నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకోవడం తీవ్రంగా ఖండించదగినది ఎటువంటి చట్ట విరుద్ధ చర్యలు చేయకపోయినా, నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కుల పై దాడి చేయడమేనని ఎర్రబెల్లి ప్రదీప్ రావు మండిపడ్డారు. ప్రజల తరఫున పోరాడుతున్న నాయకులను అరెస్టు చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పి పుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని ప్రజా సమస్యలపై స్పందించాల్సిన ప్రభుత్వం, ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కే ప్రయత్నం చేయడం ప్రజాస్వామికమని అన్నారు.

## వరంగల్‌లో అర్ధరాత్రి బీజేపీ నేతల అరెస్టులు



**మహా వరంగల్ బ్యూరో:** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుల పిలుపు మేరకు సోమవారం నిర్వహించబోతున్న అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం సందర్భంగా పోలీసులు భయభ్రాంతులకు గురి చేస్తూ ఆదివారం అర్ధరాత్రి ముందస్తుగా బీజేపీ వరంగల్ జిల్లా మాజీ కోశాధికారి కూచన క్రాంతి కుమార్ తో పాటు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ నోముల రతన్ కుమార్, జిల్లా నాయకులు కందుకూరి శ్రీనివాస్ ను అరెస్ట్ చేసి ఇంతేజార్ గంజ్ పోలీస్‌స్టేషన్ కు తీసుకువెళ్లడం జరిగింది. ఈ అక్రమ అరెస్టులు కాంగ్రెస్ ప్రభుత్వ అరాచక పాలనకు నిదర్శనమని వారు పేర్కొన్నారు.

## మహనీయుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తి



**మహా వరంగల్ బ్యూరో:** భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ల 95వ వర్ధంతి సందర్భంగా సోమవారం హనుమకొండ పట్టణంలో మిషన్ హాస్పిటల్ లో భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు అలాగే ప్రసవించిన పేషెంట్లకు పండ్ల పంపిణీ చేశారు. ఈ పండ్ల కార్యక్రమానికి ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి హాస్పటల్ ఆర్ఎం ఓ , మంజుల ఏవో రమేష్ బాబు పువ్వుల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం ఓ మంజుల, ఏవో రమేష్ బాబు జిల్లా అధ్యక్షులు జిల్లా హనుమకొండ రాజేష్ హనుమకొండ కార్యదర్శి రాజేష్ నాయక్ ఆకుల మనోజ్ సాయి రాజు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మొండి బకాయిలపై ప్రత్యేక శ్రద్ధ వహించండి

## జిల్లా కలెక్టర్/జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్





**మహా వరంగల్ బ్యూరో:** మొండి బకాయిల వసూళ్ల పై ప్రత్యేక శ్రద్ధ వహించి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్/జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పరిధిలోని 48, 49, 50, 51 డివిజన్లలో క్షేత్ర స్థాయిలో పర్యటించిన కలెక్టర్, పన్ను వసూళ్ల తీరును ప్రత్యక్షంగా పరిశీలించి సమర్థవంతంగా అమలు చేయడానికి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నక్కలగుట్ట సర్కిల్ కార్యాలయంలోని ఈ–సేవ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్, పన్ను చెల్లింపుల ప్రక్రియ పై వివరాలు తెలుసుకున్నారు. ప్రతిరోజూ ఎంత మొత్తంలో వసూళ్లు జరుగుతున్నాయి, ఏ సమయాల్లో సేవలు అందిస్తున్నారు వంటి అంశాలను పరిశీలించారు. 51వ డివిజన్‌లో రెవిన్యూ అధికారులతో కలిసి ఇంటింటికి వెళ్లి పన్ను వసూళ్ల విధానాన్ని పరిశీలించారు. 50వ డివిజన్‌లో పర్యటించిన సందర్భంలో, సంబంధిత డివిజన్లకు చెందిన బకాయిల జాబితా, ఇప్పటివరకు జరిగిన వసూళ్ల వివరాలు, ఇంకా వసూలు చేయాల్సిన బకాయిల జాబితా అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ జాబితాను ఆధారంగా తీసుకుని, బిల్ కలెక్టర్లు ప్రతి 20 అస్సెస్మెంట్ ల చొప్పున విభజించి వసూళ్లను చేపట్టాలని తెలిపారు. అలాగే, పి.ఓ.ఎస్ యంత్రాలను వినియోగంలో ఉంచి, ప్రజలు స్థానికంగానే పన్నులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలోని ప్రతి గృహం నుంచి పన్నులు చెల్లింపులు జరిగేలా చూడాలని అన్నారు. 49వ డివిజన్‌లో పర్యటించిన సందర్భంగా ఒకే ఇంటికి రెండు లేదా మూడు హౌస్ నంబర్లు ఉండడాన్ని గమనించిన కలెక్టర్, వాటిని తక్షణమే సరిచేయాలని అధికారులను ఆదేశించారు. 48వ డివిజన్‌లో సుమారు 900 గృహాల నుంచి పన్ను వసూళ్లు చేపట్టాలని సూచిస్తూ, కొన్ని డివిజన్లలో రూ. లక్షల్లో బకాయిలు ఉన్నాయని తెలిపారు. లక్ష్యాలను సాధించాలంటే ప్రణాళికాబద్ధంగా పనిచేస్తూ, ప్రతిరోజూ వార్డులో కనీసం రూ. 3 లక్షల వసూళ్లు సాధించాల్సిందిగా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఎంహెచ్ఓ డా. రాజారెడ్డి, ఆర్ఐ అనిల్ కుమార్, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



**మహా వరంగల్ బ్యూరో:** హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో బాల్య వివాహాల నిరోధక చట్టం–2006కు సంబంధించిన గోడపత్రికలను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సోమవారం ఆవిష్కరించారు. మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో, మిషన్ శక్తి జిల్లా మహిళా సాధికారత కేంద్రం ద్వారా బేటీ బచావో –బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన –ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని నివారించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. బాల్య వివాహాల నిరోధక అధికారులుగా జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్‌డీఓ/సబ్ కలెక్టర్, ప్రాజెక్టు స్థాయిలో సీడీపీవో, మండల స్థాయిలో తహశీల్దార్, సెక్టార్ స్థాయిలో ఐసీడీఎస్ సూపర్వైజర్, గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి సీఎంపీవోగా వ్యవహరిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి సత్యపాల్ రెడ్డి, డీఆర్‌డీఓ శ్రీను, పరకాల, హనుమకొండ ఆర్‌డీఓలు డాక్టర్ కన్నం నారాయణ, రాథోడ్ రమేష్, డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, డీడబ్ల్యూఓ విశ్వజ, జీఈసీఓ సునీత, ఈఓ సింధు రాణి, మిషన్ కోఆర్డినేటర్లు కళ్యాణి, పావని తదితరులు పాల్గొన్నారు.

# బల్దియాలో దోమల దండయాత్ర

**మహా వరంగల్ బ్యూరో:** రాజధాని హైదరాబాద్ సిటీ తర్వాత అతిపెద్ద నగరంగా చెప్పుకుంటున్న వరంగల్ నగరం పేరుకే స్మార్ట్ సిటీ.. గ్రేటర్ వరంగల్ నగరం ఇప్పుడు దోమల సిటీగా మారింది. నగరమంతా దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. నగర ప్రజలు విష జ్వరాల పాలవుతూ ప్రాణాలు కూడా పోగొట్టు కుంటున్నారు. నగరంలో కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీలు, ఖాళీ ప్లాట్లు, చెరువులు, కుంటల లో నీరు నిలిచి ఉండడం వల్ల దోమల లార్వా వృద్ధి చెంది ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇండ్లలో దోమల నివారణకు వినియోగించే ఎలక్ట్రికల్ పరికరాలు కూడా దోమల దాడికి అవి కూడా పనిచేయడం లేదని ప్రజలు చెబుతున్నారు. సోమవారం దోమల సమస్య తీవ్రతపై మహా పత్రికలో వచ్చిన కథనం సంచలనమైంది. వేలల్లో కథనాన్ని షేర్లు చేయడంతో పాటు పలువురు ఫోన్ చేసి అభినందించారు. సమస్య తీవ్రతకు ఇది అద్దం పడుతోంది.

### కొన్ని ప్రాంతాల్లో ప్రజలు జాగారం

వరంగల్ నగరంలో దోమలు రోజు రోజుకు పెరిగి ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కొన్ని కాలనీల తో పాటు లోతట్టు ప్రాంతాల ప్రజలు రాత్రి సమయంలో జాగారం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యంగా ఎండాకాలం వానాకాలం డెంగీ, మలేరియా, విషజ్వరాలు పెరుగుతాయని రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగానే హెచ్చరించినా బల్దియా అధికారులు, సిబ్బంది పట్టించు కోకపోవడంతో దోమల బెడద అధికమవుతున్నటు తెలుస్తోంది.

### ఇంటింటికీ జ్వరాలు

మునిసిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రజలు వరంగల్ ట్రైసిటీ తోపాటు విలీన గ్రామాల్లో ప్రతీ ఇంటిలో ఒకరైన జ్వరం భారిన పడుతున్నారు. గత యేడాది ట్రైసిటీలో దాదాపు 138 డెంగీ, 27 మలేరియా కేసులు నమోదు కాగా, గత వర్షాకాలంలో నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు ప్రజలు విష జ్వరాలు డెంగ్యూ మలేరియా వంటి వ్యాధులతో క్యూ కట్టారు. ఇంకా కొడుతూనే ఉన్నారు. ఇంట్లో ఒక్కరికి జ్వరం సోకిందంటే అందరికీ సోకుతోంది. కొన్ని ఇళ్లలో డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, జలుబు, దగ్గు తోపాటు చివరికి ప్లేట్ లైట్స్ తగ్గిపోయి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. మలేరియా సిబ్బంది బాధ్యతారాహిత్యంతో ఇదంతా జరుగుతోందని ప్రజలు భావిస్తున్నారు. విష జ్వరాలు సోకితే దాదాపు వారం 10 రోజులపాటు తగ్గడం లేదు. ప్రస్తుతం 14 లక్షల పైగా జనాభా కలిగి ఉన్న వరంగల్ నగరంలో ప్రజలకు సరిపడా సిబ్బంది లేకపోవడం.. ఉన్న సిబ్బందిలో కూడా చాలామంది విధులకు డుమ్మాలు కొట్టడం వల్ల దోమలను నియంత్రించేందుకు చేయాల్సిన ఫాగింగ్, స్ప్రే, ఆయిల్ బాల్స్ పనులకు బ్రేక్ పడుతున్నాయి. ఇటీవల ప్రతీ డివిజన్ల లో ఫాగింగ్ చేయక పోవడం దంతో దోమలు విజృంభిస్తున్నట్టు ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతీ నెల డీజిల్, పెట్రోల్‌తో పాటు దోమలు వృద్ధి చెందకుండా వాడే బెటెక్స్ టెమోపాస్, మలాథిన్ స్ప్రే చేయకుండా, ఆయిల్ బాల్స్, గంబూషియా చేపలు వేయకుండానే బిల్లులు కాజేస్తూ బల్దియా ఆదాయానికి గండికొడుతున్నట్టు విశ్వసనీయ సమాచారం.




### బల్దియా పెద్దలు స్పందించాలి

**ఇప్పటికైనా బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, మేయర్ గుండు సుధారాణి మలేరియా విభాగంలో జరుగుతున్న అవినీతిని గుర్తించి ప్రజలను దోమల బారినుంచి రక్షించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.**

### సిబ్బంది ఫుల్.. విధులు నిల్

గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్‌లకు డివిజన్‌కు ఒకటి చొప్పున బల్దియా నిధుల నుంచి రూ.50లక్షలు వెచ్చించి చిన్న ఫాగింగ్ మిషన్లు, రూ.30 లక్షలతో 4 ఫాగింగ్ ఆటోలు కొనుగోలు చేశారు. ప్రజల ఆరోగ్యం కోసం నగరంలో దోమలు, క్రిమికీటకాలను నియంత్రించేందుకు 60 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది, 90 మంది కాంట్రాక్టు సిబ్బంది, 25 మంది ప్రభుత్వ సిబ్బంది మలేరియా విభాగంలో పనిచేస్తున్నారు. వీరితో పని చేయించేందుకు ప్రధాన భూమికను పోషించే బయాలజిస్ట్ లేక పోవడంతో సీఎంహెచ్‌వో రాజారెడ్డి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. కాగా, ఇద్దరు హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, 8మంది హెల్త్ అసిస్టెంట్లు, ఇ ద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు పని చేస్తున్నారు. అయితే గతంలో చిన్న ఫాగింగ్ మిషన్‌లకు రోజుకు 5 లీటర్లు డీజిల్, ఒక లీటర్ పెట్రోల్ ఇచ్చి ఇద్దరు సిబ్బందిని కేటాయించేవారు. కానీ ప్రస్తుతం 4 పెద్ద ఫాగింగ్ ఆటోలను కొనుగోలు చేసి ఒక్కో ఆటోకు 8 డివిజన్ లలో ఫాగింగ్ చేసేందుకు పురమాయిస్తున్నారు. ఒక్క ఫాగింగ్ ఆటోకు 75 లీటర్ల డీజిల్ తో పాటు 10 లీటర్ల పెట్రోల్ ఫిల్లింగ్ చేసి పంపిస్తుండగా ఆటోలు ఎక్కడ ఫాగింగ్ చేస్తున్నాయో అధికారులకు తప్ప ప్రజలకు కనిపించడం లేదనే విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. ఇంకా 66 డివిజన్ లలో సిబ్బంది బావులలో (ప్యారా రత్నం) మందు, డ్రైనేజీలలో దోమల స్ప్రే, నీటి గుంతలు, చిన్న పాటి కుంటలలో ఆయిల్ బాల్స్ వేయాలి. ఇంకా దోమల నివారణకు వినియోగించే మలాథిన్, బెటెక్స్, ఆయిల్‌బాల్స్ నాసిరకం మందులను తెచ్చి అక్కడక్కడా పిచికారి చేసినా ప్రయోజనం లేకుండా పోతోందని ప్రజలు వాపోతున్నారు.

## విభాగంలో లీడర్ ఆధిపత్యం

బల్దియాలోని మలేరియా విభాగంలో పని చేసే ఔట్‌సోర్సింగ్, ప్రైవేటు, కాంట్రాక్ట్ (అవసర నిమిత్తం) నియమించబడిన కొందరు సిబ్బంది సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులుగా విధులకు డుమ్మా కొట్టి అధికారులను సైతం బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇంకా కొందరు వైట్ కాలర్ నాయకులు విధుల్లో చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క రోజు కూడా ఫాగింగ్ చేయడం లేదని విశ్వసనీయ సమాచారం. ప్రధానంగా వరంగల్ పోచమ్మ మైదాన్ పరిధిలోని ప్రాంతాలు, రామన్నపేట, దేశాయ్ పేట, శివనగర్, పెరుకవాడ, సమయ్య నగర్, భీమారం, లష్కర్ సింగారం, ఆరెపల్లి, కొత్తపేట, మామునూరు, హాసన్ పర్తి, సింగారం గ్రామాలకు చెందిన వారు అధికారులకు దగ్గరగా ఉండి పని చేయకున్నా నెలకు భరాబర్ గా వచ్చే జీతాన్ని దర్జాగా నొక్కేస్తున్నారు. కొందరు సిబ్బంది అధికారులు, ప్రజాప్రతినిధుల పేరు చెప్పి మరీ విధులకు రావడం లేదని అధికారులే చెబుతున్నారు. ఇటీవల మలేరియా సిబ్బందికి జీతాలు పెంచినా విధులకు సక్రమంగా రావడం లేదని తోటి సిబ్బంది చెబుతున్న మాట. తద్వారా తమ పై ఎక్కువ పని భారం పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## దోమల నివారణపై అవగాహన సున్నా

సీఎంహెచ్వో, మలేరియా ఇన్‌చార్జి అధికారి ఆదేశాలు జారీచేసిన కొంతమంది సిబ్బంది పట్టించుకోవడం లేదనేది స్పష్టమవుతోంది. వరంగల్ నగరంలో దోమల నివారణకు ఇంటింటి సర్వే చేస్తున్నట్లుగా చెబుతున్న అది నామ మాత్రంగా జరిగిందని ఎవరైనా జ్వర పీడితులు ఉన్నారా? అని తెలుసుకుని ప్రతీ వారం డ్రై డేను పాటించాలని అవగాహన కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇళ్ల చుట్టుపక్కల నీరు నిలువకుండా చూడాలని కరపత్రాలు, కళాజాత ద్వారా ప్రచారం చేసేవారు కరువయ్యారు. ప్రతీ కాలనీలో ఫాగింగ్, దోమల మందు స్ప్రే చేసే సిబ్బంది ఉన్నా లేనట్టేనని ఇప్పటి వరకు కొన్ని డెంగీ కేసులు నమోదైనట్లు తెలిసిన అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా బల్దియా అధికారులు మేల్కొని దోమల బారి నుంచి ప్రజలను అప్రమత్తం చేసి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని లేని పక్షాన ఇంకా ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందని ప్రజలు భావిస్తున్నారు.

# జిల్లా కలెక్టరేట్‌లో ప్రపంచ అరణ్య దినోత్సవం

- పర్యావరణ సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- ఆకట్టుకున్న చిత్రలేఖన పోటీలు





**మహా వరంగల్ బ్యూరో:** వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో ప్రపంచ అరణ్య దినోత్సవం సందర్భంగా సోమవారం వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సామాజిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలు, ఎమ్‌జేపీటీ పాఠశాలలు, గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలలో "పర్యావరణ పరిరక్షణ" అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల సృజనాత్మక చిత్రాలను జిల్లా కలెక్టరేట్ లో ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. చిన్నారుల మనసులోని ప్రకృతి ప్రేమ, పచ్చదనం పట్ల ఉన్న అభిరుచి, భవిష్యత్తు పై వారి ఆశలు ఆ చిత్రాల్లో ప్రతిబింబించాయి. ముఖ్యంగా జీహెచ్‌ఎస్ కరీమాబాద్ విద్యార్థులు రూపొందించిన చిత్రాలు అందరి దృష్టిని ఆకర్షిస్తూ ప్రత్యేకంగా నిలిచాయి. ఈ చిత్ర ప్రదర్శనను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిల్లా అటవీ అధికారి అనుజ్ అగర్వాల్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, ఇతర జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారి సందర్శించి విద్యార్థుల ప్రతిభను అభినందించారు. వారి సృజనాత్మకత ను చూసి కలెక్టర్ ప్రశంసించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, అరణ్యాల పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని నేటి విద్యార్థులలో పెరుగుతున్న పర్యావరణ చైతన్యం భవిష్యత్తుకు ఆశాజనక సంకేతం" అని పేర్కొన్నారు. జిల్లా అటవీ అధికారి అనుజ్ అగర్వాల్ మాట్లాడుతూ, ప్రతి పౌరుడు తన పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవం లేదా ఇతర ముఖ్య సందర్భాలలో కనీసం ఒక మొక్క నాటాలని సూచించారు. అలాంటి చిన్నచిన్న ప్రయత్నాలు కలిసొస్తే పర్యావరణాన్ని సంరక్షించడం సులభ మవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నే కాకుండా ప్రజల్లో కూడా అరణ్యాల ప్రాముఖ్యత పై అవగాహన మరింత పెంపొందించ బడింది. విద్యార్థుల సృజనాత్మకత, ప్రకృతి పట్ల వారి ప్రేమ అందరినీ ఆకట్టుకుంటూ, పర్యావరణ పరిరక్షణకు కొత్త ఆశలను నింపింది. ఈ సందర్భంగా ఉత్తమ చిత్రలేఖన ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న అందరికీ నోట్ బుక్కులు, పెన్నులు, ధ్రువ పత్రాలను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు.

# పారదర్శకంగా అంగడి బహిరంగ వేలం




**తొర్రూరు మహా:** తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అంగడి కి వివిధ వాటిల్లో టెండర్లను పారదర్శకంగా నిర్వహించారు. ఈ అంగడి వేలం కు సిల్డ్ టెండర్లు, పశువుల, మేకల, గొర్రేల బహిరంగ వేలం ను మున్సిపల్ చైర్ పర్సన్ తూనం శ్రావణ్ కుమార్ మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు పాల్గొని పశువుల, మేకల, గొర్రేల రహదారి వేలం, సిల్డు టెండర్ల లో బోమ్మనబోయిన వెంకన్న రూ. 41 10 116లకు పొందారని చైర్మన్ శ్రవణ్ కమిషనర్ శ్యాంసుందర్ తెలిపారు. తైబజార్ (గంప చీటి) బహిరంగ వేలం, సిల్డు టెండర్ల లో రూ 3 50 500 లకు కొలుపుల శంకర్ పొందారని , మిగిలిన కమేలా, చికెన్ వ్యర్థముల సేకరణ టెండర్ల లో ఎవరు పాల్గొననందున తిరిగి వేలం ఈ నెల 28 న నిర్వహించడం జరుగుతుందని కమిషనర్ శ్యాంసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు .ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



# రేషన్ కార్డు ఉన్నవారికి రూ.5 లక్షల జీవిత బీమా

**మహా వరంగల్ బ్యూరో:** రేషన్ కార్డులు ఉన్నవారందరికీ రూ.5 లక్షల జీవిత బీమాకు తెలంగాణ ప్రభుత్వం మరో నూతన పథకానికి శ్రీకారం చుట్టింది. 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పేరుతో రేషన్ కార్డులు ఉన్న ప్రతి కుటుంబానికీ జీవిత బీమాను అందించనుంది. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి ఈ పథకంపై బడ్జెట్ ప్రసంగంలో ప్రకటన చేయగా.. జూన్ 2వ తేదీన పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఈ పథకం కింద రేషన్ కార్డులో ఉన్న కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల జీవిత బీమా వర్తింపచేస్తారు. సామాజిక, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా రాష్ట్ర పౌరులందరికీ ఈ పథకం వర్తించనున్నట్లు సమాచారం.

# రాజీతో సమస్యలను పరిష్కరించుకోండి

**మహా వరంగల్ బ్యూరో:** ఈ నెల 28వ తేది జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28, శనివారం జాతీయ లోక్ అదాలత్ ఉన్నందున రాజీ పడదగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసుల తో పాటు బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ వంటి కేసుల్లో కక్షిదారులు రాజీ పడే అవకాశం ఉంటుందని తెలిపారు. రాజీయే రాజ మార్గమన్నారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దన్నారు. జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా లోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు ఇతర పోలీస్ సిబ్బంది రాజీ పడ్డ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించడం జరుగుతుంది. కాగా ఎవరైనా తమ కేసులలో రాజీ కావాలకున్నవారు పోలీస్ అధికారులకు సంప్రదించాలని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుంది అని పోలీస్ కమిషనర్ తెలిపారు.



# గుడుంబా స్థావరంపై పోలీసుల దాడి

## కేసు నమోదు చేసిన గీసుగొండ పోలీసులు


**మహా వరంగల్ బ్యూరో:** గొర్రె కుంట గ్రామ శివారులో నందనాయక్ తండకి చెందిన భూక్యా శంకర్, తండ్రి పేరు సేవ అనే వ్యక్తి ప్రభుత్వ నిషేధిత గూడంబ ను తయారు చేస్తున్నాడనే పక్కా సమాచారంతో గూడంబా స్థావరం పై దాడి చేసి సుమారు 600 లీటర్ల గూడంబా పానకాన్ని ధ్వంసం చేయడం తో పాటు 5 లీటర్ల గూడంబా ను స్వాదీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ డి విశ్వేశ్వర్ మాట్లాడుతూ గూడంబా వంటి అక్రమ మద్యం తయారు చేయడం, నిల్వ ఉంచడం, రవాణా చేయడంతో పాటు అమ్మడం చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. అంతేకాకుండా గూడంబా సేవించడం వల్ల అనారోగ్య సమస్యల తో మరణాలు సంభవించే ప్రమాదం ఉందని గూడంబా తయారు చేసిన వారు, అమ్మిన వారు, సరఫరా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అక్రమ మద్యం తయారీ లేదా అమ్మకాల పై సమాచారం తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని గీసుగొండ సీఐ డి. విశ్వేశ్వర్ తెలిపారు.



# ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

## హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి





**హనుమకొండ మహా:** ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కారానికి చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశపు హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణి కార్యక్రమంలో అర్జీలను అందించగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు 127 అర్జీలను కలెక్టర్, అదనపు కలెక్టర్లకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను సంబంధిత శాఖల వారీగా త్వరగా పరిష్కరించాలన్నారు. పరిష్కరించిన దరఖాస్తుల సమాచారాన్ని సంబంధిత అర్జీదారులకు ఆయా శాఖల అధికారులు తెలియజేయాలన్నారు. ఇటీవల జరిగిన దిశా కమిటీ సమావేశంలో వివిధ మండలాల్లో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆరోగ్య ఉప కేంద్రాల భవన నిర్మాణాల కోసం స్థలాల కేటాయింపు అంశం గురించి చర్చించడం జరిగిందని, కాజీపేట, హనుమకొండ, ధర్మసాగర్, వేలేరు, హసన్ పర్తి మండలాల తహసిల్దార్లు ఆరోగ్య ఉప కేంద్రాల కోసం స్థలాలను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సత్యపాల్ రెడ్డి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, డి ఆర్ డి ఓ మేన శ్రీను, జడ్పీ సీఈవో శేషాద్రి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో 127 వినతులు స్వీకరణ

**మహా వరంగల్ బ్యూరో:** వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రజల నుండి వినతిపత్రాలను స్వీకరించారు. ప్రజావాణికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజలు సమర్పించిన వినతిపత్రాలను పరిశీలించిన కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులతో దరఖాస్తుదారుల సమక్షంలోనే చర్చించి సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజావాణిలో అందిన వినతులను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 127 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. అందులో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 50, జీడబ్ల్యూఎంసీకి సంబంధించినవి 16, ఇతర శాఖలకు



సంబంధించినవి 61 దరఖాస్తులు ఉన్నట్లు వెల్లడించారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులు అధికంగా వచ్చిన నేపథ్యంలో, వాటిని సంబంధిత తహసీల్దార్లకు ఎండార్స్ చేసి త్వరితగతిన పరిష్కారం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా వృద్ధుల సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను శిశు సంక్షేమం, వయోవృద్ధుల సంక్షేమ శాఖకు, అలాగే సఖి సెంటర్ కోఆర్డినేటర్ శ్రీలతకు పంపించారు. ఈ



సందర్భంగా జిల్లా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, శాఖల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను ఎప్పటికప్పుడు పరిష్కరించుతూ ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రజావాణి సందర్భంగా మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి, హాజరైన దరఖాస్తుదారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ప్రజావాణి కార్యక్రమం ఆలస్యం కావడంతో



దరఖాస్తుదారులకు అరటిపండ్లు, బట్టర్ మిల్క్ ప్యాకెట్లను పంపిణీ చేయడం తో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వై.వి. గణేష్, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, హౌసింగ్ పీడీ శ్రీవాణి, డీఎంహెచ్వో డాక్టర్ సాంబశివరావు, తదితర శాఖల జిల్లా అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితులకు శిక్ష

## పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం రంజిత్ కుమార్

**మహా వరంగల్ బ్యూరో:** హనుమకొండ జిల్లా, సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన నాన్ గ్రేవ్ ఎన్ డి పి ఎస్ (గంజాయి)కేసులో సోమవారం కోర్టు తీర్పు వెలువడింది. క్రైమ్ నంబర్ 436/2023, ఎస్.సీ నంబర్ 5/2024 కు సంబంధించిన ఈ కేసుల్లో ఎన్ డి పి ఎస్ చట్టం సెక్షన్ 8(సీ) ఆర్/డబ్ల్యు 20(బి)(ఐఐ)(బి) కింద నిందితులపై విచారణ జరిపిన అనంతరం నిందితులకు కోర్టు శిక్ష విధించింది. ఏ1. సునీల్ కుమార్ డాకువా (29 సంవత్సరాలు), డ్రైవర్, ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా, క్యామిడి గ్రామం నివాసి. ఏ2. సుకాంత్ నాయక్ (30 సంవత్సరాలు), కూలీ, ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా, శికార్పూర్ గ్రామం నివాసి. తేదీ 28 7 2023 ఈ ఇద్దరు నిందితులు వడ్డేపల్లి క్రాస్ రోడ్డు వద్ద రెండు సంచులలో ఎండు గంజాయిని అక్రమ రవాణా చేస్తుండగా అప్పటి సబ్ ఇన్స్పెక్టర్ ఎన్. రవికుమార్ తన సిబ్బందితో కలిసి పెట్రోలియం చేయించుండగా పోలీసులను చూసి ఇద్దరు వ్యక్తులు పారి పోతుండగా వీరిని పట్టుకొని తనిఖీ చేయగా వీరి వద్ద 19 కిలోల ఎండు గంజాయి ఉన్నది. వీరి పై సబ్ ఇన్స్పెక్టర్ ఎన్ రవి కిరణ్ వీరి పై కేసు నమోదు చేసి తహసిల్దార్ సమక్షంలో పంచనామా నిర్వహించారు. వీరికి కోర్టు ఒక్కొక్కరికి 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష తో పాటు రూ.10,000 జరిమానా విధించింది. ఈ కేసును సుబేదారి పోలీస్ స్టేషన్‌కు చెందిన అప్పటి సబ్ ఇన్స్పెక్టర్ ఎన్. రవికిరణ్ నమోదు చేయగా, ఇన్వెస్టిగేషన్ ను అప్పటి ఇన్స్పెక్టర్ పి. సత్యనారాయణ రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కేసులో కీలక పాత్ర పోషించిన కోర్ట్ హెడ్ కానిస్టేబుల్ ఎం. చందర్ కృషిని ప్రస్తుత సుబేదారి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం. రంజిత్ కుమార్ ప్రశంసించారు. కేసు విజయవంతంగా దర్యాప్తు చేసి నిందితులకు శిక్ష పడేలా చేసినందుకు ఆయనను అభినందించారు.

# కవి సమ్మేళనంలో ప్రతిభ చాటిన కవి రాంబాబు

## కవి రాంబాబు ను సత్కరించిన ఏసీపీ విజయ్ కుమార్

**తొర్రూరు మహా:** తెలంగాణ ప్రభుత్వం– భాషా సాంస్కృతిక శాఖ, వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో హనుమకొండ లోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన జాతీయ బహు భాష కవి సమ్మేళనంలో మహబూబాబాద్ జిల్లా తెలంగాణ సామాజిక రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇమ్మడి రాంబాబు పాల్గొని యుద్ధ మేఘాలు ఆగాలి శాంతి కపోతం ఎగరాలి అనే శీర్షికతో కవితా గానం చేయగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏసీపీ విజయ్ కుమార్ చేతుల మీదుగా ఇమ్మడి రాంబాబును మరో కవి నాళం శ్రీనివాస్ లను సన్మానం, సత్కారం , ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా హన్మకొండ వరంగల్ శాఖ అధ్యక్షులు మాట్లాడుతూ ప్రపంచ స్వరాలు కవిత్వం ద్వారా ప్రజలను ఐక్యం చేయడానికి ఉద్దేశించి దేశ నలుమూలల నుంచి ఉర్దూ హిందీ ఇంగ్లీష్ తెలుగు భాషలో ఉన్న కవులను రచయితలను ఆహ్వానించడం జరిగింది. వారు తమ సృజనాత్మకమైన ప్రతిభను పెంచుకోవడానికి వేదికగా ఈనాటి కవి సమ్మేళనం పోటీలు ఉపయోగపడుతుం




దని అన్నారు. కవులు రచన శక్తిని పెంచుకొని కవిత్వంలో పటుత్వాన్ని ఎలా పెంచుకోవాలో సూచనలు చేశారు ఈ కార్యక్రమంలో వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఫౌండర్ అండ్ చైర్మన్ మహమ్మద్ సిరాజోద్దీన్, వరంగల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఆచార్య వెలిదండి రవికుమార్, బీటవరం శ్రీమన్నారాయణ, అన్వర్, పోతన చారి కరీంనగర్ ఏటునాగారం జనగామ ,ఖమ్మం తొర్రూరు ఉమ్మడి వరంగల్ జిల్లా తదితర ప్రాంతాల నుంచి మరి 100 మంది పైగా ప్రసిద్ధ కవులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బడ్జెట్ అంకెల గారడి

## ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్ సర్కార్

## మాజీ జెడ్పిటిసి మంగళపల్లి శ్రీనివాస్, పసుమర్తి సీతారాములు

**తొర్రూరు మహా:** అసెంబ్లీ సమావేశాలలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఓ అంకెల గారెడీ బడ్జెట్ అని మండల బి ఆర్ఎస్ అధ్యక్షులు నాయకులు పసుమర్తి సీతారాములు అన్నారు. సోమవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు తొర్రూరు లోని బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆడిన అంకెల గారడి బడ్జెట్ పై ప్రెస్ మీట్ లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ రైతులు రైతు కూలీలు నిరుద్యోగ యువత మహిళలకు అరచేతిలో స్వర్గం చూపిస్తూ ఆరు పథకాల గ్యారెంటీ కార్డులు కాక సుమారు 420 పథకాలను అమలు చేస్తామని ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి నెరవేర్చటానికి వీలులేనివిదంగా,ఫండ్ కేటాయించకుండా అతిపెద్ద బడ్జెట్ అని చెప్పుకుంటూ ప్రభుత్వాన్ని నిలబెట్టిన ప్రజలను మోసం చేసింది కాంగ్రెస్ పార్టీ మంత్రులు వారు స్వప్రయోజనాలు మాత్రమే చేసుకుంటూ ప్రజలను అతిపెద్దగా మోసం చేసిందని మండల పార్టీ అధ్యక్షులు పసుమర్తి సీతారాములు మాజీ జెడ్పిటిసి మంగళపల్లి శ్రీనివాస్ మాజీ ఎంపీపీ అంజయ్యలు పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో అన్నారు. స్థానిక ఎమ్మెల్యే గత ప్రభుత్వంలో మాజీ మంత్రి దయాకర్




మంజూరు చేయించి టెండర్లు అయిన వాటిని కూడా రద్దుచేసి ఏ పనులు చేయకుండా తొర్రూర్ మండలాన్ని అభివృద్ధి చేశానని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పసుమర్తి సీతారాములు మాజీ ఎంపీపీ చిన్న అంజయ్య, జిల్లా పరిషత్ మాజీ జడ్పీటిసి, బి ఆర్ఎస్ జిల్లా నాయకులు మంగళపల్లి శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి ప్రమోద్ టౌన్ ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనివాస్ కౌన్సిలర్లు ధరావత్ పద్మ, మాడుగుల భవాని, మాజీ కౌన్సిలర్లు ఎన్నమనేని శ్రీనివాస్ గూగులోత్ శంకర్ మాజీ కో ఆప్షన్ అంకుష్ మాజీ బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు దరావత్ జై సింగ్,మాజీ సర్పంచులు మాలోతు కాలు నాయక్ అపావత్ సురేష్ సింగల్ విండో మాజీ కోఆప్షన్ డైరెక్టర్ మెరుగు ప్రకాష్, మహిళా నాయకురాలు కల్లూరు కళావతి, మండల మరియు టౌన్ ముఖ్య నాయకు కుమార స్వామి, కృష్ణ , రవి, శ్యామ్, మహేష్ టౌన్ ముఖ్య నాయకులు 5వ వార్డ్ అధ్యక్షులు ధరావత్ బాలు నాయక్, నాయకులు మల్లేష్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

**తొర్రూరు మహా:** దంతాలపల్లి మండలం పెద్ద ముప్పారం గ్రామంలో పిడిఎస్యు ఆధ్వర్యంలో భారత విప్లవ వీరుడు భగత్ సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేతిలో కోవత్తులు



పట్టుకుని భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులు అర్పించడం ద్వారా ఆయన త్యాగం, పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి ఊడుగుల లింగన్న మాట్లాడుతూ, బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి ఎదురు నిలబడి తన ప్రాణాలను త్యాగం చేసిన భగత్ సింగ్ ఒక సాధారణ వ్యక్తి కాదని, ఆయన ఒక ఆలోచన, ఒక విప్లవ జ్యోతి అని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం మాత్రమే కాకుండా, సమానత్వం, దోపిడి రహిత సమాజం కోసం ఆయన చేసిన పోరాటం నేటికీ ప్రాసంగికమైందని స్పష్టం చేశారు. ఇప్పటి పాలక వర్గాలు భగత్ సింగ్ వంటి మహనీయుల పేర్లనుఉపయోగించుకుంటూ వారి ఆశయాలను పక్కన పెట్టడం దురదృష్టకరమని తీవ్రంగా విమర్శించారు. భగత్ సింగ్ కలలుగన్న సమాజం అంటే శ్రమజీవులకు గౌరవం, విద్యార్థులకు భవిష్యత్ భద్రత, రైతులకు న్యాయం కలిగిన సమాజమని, అలాంటి సమాజ నిర్మాణం కోసం విద్యార్థులు, యువత ముందుకు రావాలనిపిలుపునిచ్చారు.విద్యార్థుల పాత్రపై ప్రత్యేకంగా మాట్లాడుతూ, విద్య కేవలం ఉద్యోగం కోసం కాకుండా సమాజ మార్పు కోసం ఆయుధంగా మారాలని అన్నారు. అన్యాయాలు, అసమానతలు పెరుగుతున్న ఈ కాలంలో భగత్ సింగ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి యువకుడి బాధ్యతగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని విప్లవ నినాదాలతో ప్రాంతాన్ని మార్మోగించారు. ''విప్లవం వర్ధిల్లాలి'', ''భగత్ సింగ్ అమరుడు'' వంటి నినాదాలు కార్యక్రమానికి ఉత్సాహాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో ధర్మారం సందీప్ కోడిమణి ముత్యం గణేష్ అనిల్ పాల్వాయి సిద్దు చందు పాల్వాయి రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.